

ఆరోగ్యంపై పట్టుసడలొద్దు

అసలే వర్షాకాలం.. వ్యాధులు సోకడానికి అవకాశం ఉంటుంది. కంటికి మంచిగా కనిపించే పదార్థాల జోలికి వెళ్తుంటారు. దీంతో అనారోగ్యం పాలవుతుంటారు. 8లో



బీఆర్‌ఎస్‌తోనే పల్లెల అభివృద్ధి 9లో

బీఆర్‌ఎస్‌తోనే పల్లెల అభివృద్ధి సాధ్యమవుతోందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రత్యేక నిధులతో సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

సంగారెడ్డి డీఎస్పీగా రమేశ్



రమేశ్ కుమార్

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి నూతన డీఎస్పీగా జె.రమేశ్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన 1998 బ్యాచ్‌కు చెందిన వారు. గతంలో సైబరాబాద్, హైదరాబాద్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. పదోన్నతిపై సంగారెడ్డి డీఎస్పీగా వచ్చారు.

న్యూస్‌రీల్

విద్యార్థినులకు వైద్యపరీక్షలు



విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ విజయ్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 'విద్యార్థినులకు అస్వస్థత' శీర్షికన సాక్షిలో వచ్చిన వార్తకు వైద్యాధికారులు స్పందించారు. కలుషిత ఆహారం తిని విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని కొందరు ప్రచారం చేయడం కలకలంరేపిన విషయం విధితమే. డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ రాజేశ్వర్, సిర్గాపూర్ పీహెచ్‌సి డాక్టర్ విజయ్‌కుమార్ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. తరగతి గదులు, వంట గది, పరిసరాలను పరిశీలించారు. పాఠశాల అంతా పరిశుభ్రంగా ఉందని డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురై పూర్తిగా కొలుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శామలాదేవి, వైద్య సిబ్బంది జెట్ల భాస్కర్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంసీ డీసీగా సురేశ్ బాధ్యతలు స్వీకరణ



సురేశ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డిప్యూటీ కమిషనర్‌గా సురేశ్ బాధ్యతలు స్వీకరించారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న బాలయ్య బదిలీపై గోషామహల్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో మేడ్చల్ పరిధి పోచారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సురేశ్ పటాన్‌చెరు సర్కిల్–22 డిప్యూటీ కమిషనర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్–22 పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సురేశ్‌ను కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు



మాధురి



బి.చంద్రశేఖర్

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బి.చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా మాధురి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ నగేష్, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు వారికి స్వాగతం పలికి పరిచయం చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా కొనసాగిన బి.చంద్రశేఖర్‌ను సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కొనసాగిన జి.వీరారెడ్డిని సీసీఎల్‌ఏ కార్యాలయానికి బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో జగిత్యాల ఆర్డీఓగా పనిచేస్తున్న మాధురిని జిల్లా అదనపు కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది.

ఆర్టీసీ ఉద్యోగులకు పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న ఉద్యోగులు

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ మెదక్ రీజియన్ పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బుధవారం ఈడీ పురుషోత్తంతో పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ ఆర్టీసీ పటిష్టతకు కృషిచేస్తున్న 28 మంది ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలు రావడం సంతోషకరమన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. మెదక్ రీజియన్ రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో ఉంచడానికి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మెదక్ రీజియన్ మేనేజర్ ఎస్.సుదర్శన్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ జోత్స్న, దైవదినం, సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టు పడదామా..!

ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్‌కు కాస్తపట్టున్న నియోజకవర్గాలపై బీఆర్‌ఎస్ ప్రత్యేక దృష్టి సారించిందా? హస్తం పార్టీ ఆశలు పెట్టుకున్న ఆయా స్థానాల్లో ఆపరేషన్ ఆకర్ష్‌కు తెర లేపిందా? ఆయా చోట్ల కీలకమైన సామాజికవర్గాల నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వడం ద్వారా వారికి మరింత దగ్గరయ్యే ప్రయత్నం చేస్తోందా? ఇటీవల జరిగిన తాజా రాజకీయ పరిణామాలు అవుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రానున్న ఎన్నికల్లో పదికి పది స్థానాలు గెలుచుకుంటామనే ధీమా వ్యక్తం చేస్తున్న అధికార బీఆర్‌ఎస్ ఆ దిశగా ఇప్పటి నుంచే వ్యూహాలను అమలు చేస్తోంది.



- ఆ పార్టీకి బలం ఉన్న స్థానాలపై బీఆర్‌ఎస్ దృష్టి
- చేరికలతో మరింత పట్టు సాధించే యత్నం
- కీలక సామాజికవర్గాల నేతలకు నామినేటెడ్ పదవుల ఎర!
- ఆసక్తికరంగా మారిన బీఆర్‌ఎస్ తాజా రాజకీయాలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ జిల్లాలో జహీరాబాద్, సంగారెడ్డి, అందోల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు కాస్త పట్టుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సంగారెడ్డి స్థానాన్ని గెలుచుకుంది. పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఎక్కువ ఓట్లు వచ్చాయి. ఇటు అందోల్‌లోనూ పార్టీకి కొంత మేర పట్టుంది. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాలపై అధికార బీఆర్‌ఎస్ దృష్టి పెట్టింది. ఎన్నికలకు మూడు నెలల ముందుగానే ఈ స్థానాల్లో కాంగ్రెస్‌కు కట్టడి చేసేందుకు ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేస్తోంది.

నామినేటెడ్ పదవులు

☛ అధికార పార్టీ ఇటీవల పలువురు నేతలకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టింది. ఇందులో జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ తన్వీర్‌కు నామినేటెడ్ పదవి ఇచ్చింది. ఇప్పటికే మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్న తన్వీర్‌కు తాజాగా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించింది. జహీరాబాద్‌లో మైనారిటీల ఓట్లు ఎంతో కీలకం. అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించే స్థాయిలో ఓట్లు ఉన్నాయి. తన్వీర్‌కు నామినేటెడ్ పదవి దక్కడం బీఆర్‌ఎస్‌కు కలిసొచ్చే అంశమనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

☛ మరోవైపు తెలంగాణ జాగృతి నాయకుడు మఠం భిక్షపతికి కూడా ఇటీవల నామినేటెడ్ పదవి వరించింది. తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన నియమితులయ్యారు. లింగాయత్ సామాజికవర్గానికి చెందిన భిక్షపతికి పదవి ఇవ్వడం ద్వారా ఆ సామాజికవర్గానికి ప్రభుత్వం సముచిత స్థానం ఇచ్చినట్లయిందనే భావనతో ఉంది. జిల్లాను సస్యశ్యామలం చేసే రెండు భారీ ఎత్తిపోతల పథకాల్లో ఒకదానికి బసవేశ్వర స్వామి పేరు కూడా ప్రభుత్వం పెట్టింది. ఇప్పటికే డీసీఎంఎస్ చైర్మన్‌గా ఇదే సామాజికవర్గానికి చెందిన శివకుమార్ ఉన్నారు. ఇలా సంగారెడ్డి జిల్లాలో కీలకమైన లింగాయత్ సామాజికవర్గానికి మరింత దగ్గరయ్యే దిశగా బీఆర్‌ఎస్ అడుగులు వేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

☛ ఇటీవల నామినేటెడ్ పదవులు దక్కిన నేతల్లో మాజీ ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రొటెం చైర్మన్ భూపాల్‌రెడ్డి కూడా ఉన్నారు. తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ పదవి భూపాల్‌రెడ్డికి దక్కింది. పటాన్‌చెరు నియోజకవర్గంలో భూపాల్‌రెడ్డి పట్టుంది. సిట్టింగ్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో భూపాల్‌రెడ్డికి కొంతకాలంగా పొసగడం లేదు. మహిపాల్‌రెడ్డికి పరోక్షంగా టిక్కెట్టు ఖరారు చేసిన అధినేత కేసీఆర్ భూపాల్‌రెడ్డికి మరోమారు సముచిత స్థానం ఇవ్వడం ద్వారా పార్టీలో నెలకొన్న అసంతృప్తులను బుజ్జగించినట్లయిందనే భావన వ్యక్తమవుతోంది.

చేరికలతో ఇరకాటం

☛ చేరికలపైనా బీఆర్‌ఎస్ పార్టీ దృష్టి పెట్టింది. కాంగ్రెస్ పార్టీ నేతలను బీఆర్‌ఎస్‌లో చేర్చుకోవడం ద్వారా ఆ పార్టీని మరింత ఇరకాటంలో పడేసినట్లయింది. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన జహీరాబాద్‌లో నరోత్తం హస్తం పార్టీకి రాజీనామా చేసి, బీఆర్‌ఎస్‌లో చేరారు.

☛ జహీరాబాద్ కాంగ్రెస్ టిక్కెట్ ఆశించిన నరోత్తం బీఆర్‌ఎస్‌లో చేరడంతో జహీరాబాద్‌లో కాంగ్రెస్ కొత్త అభ్యర్థిని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని బీఆర్‌ఎస్ విమర్శిస్తోంది. అలాగే జహీరాబాద్ నియోజకవర్గంలో పట్టున్న సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్ కూడా ఇటీవల గులాబీ పార్టీలో చేరారు.

☛ ఈ నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా ఉన్న మాజీ మంత్రి గీతారెడ్డి అనారోగ్య సమస్యలతో పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో ఇక్కడ స్థానికేతరులను అభ్యర్థిగా తెచ్చుకోవాల్సిన పరిస్థితి కాంగ్రెస్‌కు ఏర్పడిందని గులాబీ నేతలు విమర్శిస్తున్నారు. ఇటు అందోల్‌లోనూ క్షేత్రస్థాయి లో చేరికలపై బీఆర్‌ఎస్ పార్టీ దృష్టి సారించింది.

☛ మునిపల్లి, రాయ్‌కోడ్ మండలాల్లో గ్రామ స్థాయిలో కీలక నాయకులు ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇక సంగారెడ్డి నియోజకవర్గంలో కూడా ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు హస్తం పార్టీని వీడి, బీఆర్‌ఎస్‌లో చేరారు. తాజాగా రిటైర్డు ఉద్యోగ సంఘాల నాయకులు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇలా కాంగ్రెస్‌కు కాస్త గెలుపు అవకాశాలున్న నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఇప్పటి నుంచే రాజకీయంగా పట్టుబిగించే ప్రయత్నాలు చేస్తుండడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ముసురేసింది..



- జిల్లాలో విస్తారంగా వర్షం
- పంటలకు ఎంతో మేలు చేస్తుందన్న రైతులు
- సింగూరుకు పెరిగిన ఇన్‌ఫ్లో

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో రోజంతా ముసురు కమ్ముకుంది. మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమైన ముసురు బుధవారం రాత్రి వరకు కొనసాగింది. రోజంతా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. జిల్లాలో ఎక్కడా భారీ వర్షాలు నమోదు కాకపోయినప్పటికీ ముసురుతో పనుల కోసం బయటకు వెళ్లాల్సిన వారు ఇబ్బందులు పడ్డారు. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లాలో వాతావరణం మేఘావృతమై ఉంది. బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలో పలుచోట్ల నమోదైన వర్షపాతాన్ని పరిశీలిస్తే.. గుమ్మడిదల (నల్లవల్లి)లో 1.5 సెం.మీల వర్షపాతం రికార్డయింది. హత్నూరలో 1.4 సెం.మీలు, చౌటకూర్‌లో 1.3 సెం.మీలు, పుల్కల్ (లక్ష్మీసాగర్)లో 1.2 సెం.మీలు, ఆందోల్ (అన్నాసాగర్)లో 1.1 సెం.మీలు, రామచంద్రాపురం, జిన్నారం, అమీన్‌పూర్‌లలో 1 సెం.మీల చొప్పున వర్షం కురిసింది. పటాన్‌చెరువులో 0.9 సెం.మీలు, సదాశివపేట్‌లో 07 సెం.మీలు, సంగారెడ్డిలో 0.7 సెం.మీలు, కందిలో 0.6 సెం.మీలు, నిజాంపేటలో 0.6 సెం.మీలు, కొండాపూర్‌లో 0.5 సెం.మీలు, వట్‌పల్లి, మునిపల్లిల్లో 0.4 సెం.మీల చొప్పున వర్షపాతం రికార్డు అయింది.

పంటలకు జీవం..

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం పంటలకు ఎంతో మేలు చేస్తోంది. పక్షం రోజులుగా జిల్లాలో ఆశించిన మేరకు వర్షం పడలేదు. దీంతో పత్తి, సోయా వంటి పంటలు విత్తుకున్న రైతులు ఆందోళన చెందారు. ఇప్పుడు కురుస్తున్న ఈ వర్షాలతో ఈ పంటలకు జీవం వచ్చినట్లయింది. ఇప్పటికే బోర్ల కింద సాగు చేసుకున్న రైతులు నాట్లు వేసుకుంటున్నారు.

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు..

కర్ణాటకతో పాటు, జిల్లాలో కురిసిన వర్షానికి సింగూరు జలాశయానికి వచ్చే ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. బుధవారం సాయంత్రం ఆరు గంటలకు సగటున 2,875 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైందని నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో వాగులు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. చెరువుల్లోని నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది.

సాగుకు సింగూరు జలాలు



సాగుకు సింగూరు నీరును విడుదల చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుతో సాగు, తాగు నీటి సమస్య తీరిందని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీతో కలిసి బుధవారం సాగుకు సింగూరు ప్రాజెక్టు సిలారపు రాజనర్సింహా కాలువ నుంచి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగూరు ప్రాజెక్టుతో ప్రస్తుతం అందోల్ నియోజకవర్గ సాగు సమస్యలు తీరగా భవిష్యత్‌లో సంగమేశ్వర, బసవేశ్వర పథకాలవల్ల నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గంలో సాగు సమస్యలు తీరుతాయన్నారు. ఈ పంట కాలువ ద్వారా పుల్‌కల్, చౌటకూర్, అందోల్ మండలాలలో సాగు నీటి సమస్యలు తీరాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతు వ్యతిరేకి అని విమర్శించారు. పెద్దారెడ్డిపేట రైతు వేదికలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పట్లోళ్ల చైతన్య రెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు యాదగిరిరెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌చారి, సర్పంచ్ సతీశ్‌కుమార్, ప్యాక్స్ డైరెక్టర్ మహేశ్‌బాబు, బీఆర్‌ఎస్ నాయకులు విజయభాస్కర్ రెడ్డి, కనకారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

- డీఎస్పీ పురుషోత్తం రెడ్డి



బాధ్యతలు స్వీకరించిన పురుషోత్తం రెడ్డి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డీఎస్పీగా పురుషోత్తంరెడ్డి బాధ్యతలు చేపట్టారు. రాచకొండ పరిధిలోని వనస్థలిపురంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా పనిచేస్తున్న పురుషోత్తం రెడ్డి పటాన్‌చెరు డీఎస్పీగా బదిలీపై వచ్చారు. ఇంతకు ముందు ఇక్కడ విధులు నిర్వహించిన డీఎస్పీ భీమ్ రెడ్డి హైదరాబాద్ చీఫ్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బదిలీపై వెళ్తున్న డీఎస్పీ పదవీ బాధ్యతలు డీఎస్పీ పురుషోత్తం రెడ్డికి అప్పగించారు. పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు



వినతి పత్రం అందజేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

కొండాపూర్(సంగారెడ్డి): మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికుల ఐదు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎస్‌ఈ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న పంపు ఆపరేటర్స్, లైన్‌మెన్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, స్వీపర్, ల్యాబ్ కార్మికులకు ఐదు నెలల వేతనాలు అందకపోవడంతో వారి కుటుంబాలు అల్లాడుతున్నాయన్నారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించుకుంటే పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం మిషన్ భగీరథ ఈఈ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్, సీహెచ్ రాములు కార్మికులు పాల్గొన్నారు .

నేడు టీఎస్‌ఐడీసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం



ఎండీ తన్వీర్ →

జహీరాబాద్: రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌ఐడీసీ) చైర్మన్‌గా పట్టణానికి చెందిన ఎండీ తన్వీర్ గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉదయం 10 గంటలకు హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోగల పరిశ్రమల భవన్‌లోని కార్యాలయంలో నిర్వహించనున్న కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ హాజరు కానున్నారు.

పకడ్బందీగా పథకాల అమలు

- జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాది



మాట్లాడుతున్న జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాది

సంగారెడ్డి టౌన్: మైనారిటీ సంక్షేమ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలుకు ఆయా శాఖలు పనిచేయాలని జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాది అన్నారు. బుధవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమం, కేంద్ర, రాష్ట్ర పథకాల అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మైనారిటీల స్థితిగతులు, వారి జనాభా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుతో చేకూరుస్తున్న లబ్ధిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మైనారిటీ రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, మహిళా శిశు సంక్షేమం, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, మెప్మా, విద్యా, బ్యాంకింగ్, రెవెన్యూ తదితర శాఖల ద్వారా మైనారిటీలకు అమలు చేస్తున్న కార్యక్రమాలు, వాటి ప్రగతిని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా షెహజాది మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం కోసం ఉద్దేశించిన కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అమలు జరిగేలా ఆయా శాఖల అధికారులు అంకితభావంతో పని చేయాలన్నారు. విద్య, ఉపాధి రంగాలకు మైనారిటీలకు విరివిగా రుణాలు అందజేయాలన్నారు. ప్రధాన మంత్రి 15 అంశాల కార్యక్రమం మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతీ మూడు మాసాలకోసారి కమిటీ సమావేశం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం కలెక్టరేట్లో ఏ ర్పాటు చేసిన ఓటర్ అవగాహన కేంద్రాన్ని ఆమె సందర్శించి, ఓటు వేసి పరిశీలించారు . సమావేశంలో జిల్లా ఎస్పీ రమణ కుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి నగేష్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అరుణ్ కుమార్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రశాంత్ కుమార్, డీఆర్డీఓ శ్రీనివాసరావు, సంక్షేమ శాఖ అధికారి పద్మావతి, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ గాయత్రీ దేవి, మెప్మా పీడీ గీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు రవీందర్ రెడ్డి, వెంకారెడ్డి, పాండు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

న్యాయ సహాయం కోసం సంప్రదించొచ్చు

సంగారెడ్డి టౌన్: స్కోప్ ఎన్జీవో సంగారెడ్డి ఆధ్వర్యంలో సెక్స్ వర్కర్లకు రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు హాజరయ్యారు. సెక్స్ వర్కర్లకు హక్కులు, అవసరాలు తీర్చేలా ఎన్జీవోలు పనిచేస్తాయన్నారు. ప్రభుత్వ పథకాలు అందడం కోసం రేషన్ కార్డుకు సహకారాలు అందిస్తారని, పిల్లలను చక్కగా చదివించుకోవాలన్నారు. న్యాయ సహాయం కోసం కోర్టులో సంప్రదించవచ్చన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డిలోని తార ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తార ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ బుధవారం తెలిపారు. అర్హులు ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిరాక్స్‌తో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 24వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. వివరాలకు 94410 690 20 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.



క్లుప్తంగా

వల చుట్టుకొని మత్స్యకారుడి బలవన్మరణం


స్వామి(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): చేపలవేటకు వెళ్లిన మత్స్యకారుడు వలకు చిక్కి చెరువులోనే మునిగి బలవన్మరణం చెందాడు.. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలం చందంపేటలో బుధవారం చోటుచేసుకుంది. పోలీస్‌ల కథనం మేరకు.. మండలంలోని చందంపేటకు చెందిన వడియారం పెద్దస్వామి(30) స్థానిక పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లి వల కాళ్లకు చుట్టుకొని నీటిలో మునిగి మృతిచెందాడు. రోజు మాదిరిగానే ఉదయం చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మధ్యాహ్నం అయినప్పటికీ తిరిగిరాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు చెరవువద్దకు వెళ్లి చూడగా ఆచూకీ తెలియరాలేదు. దీంతో చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడికి తల్లి లక్ష్మి, భార్య భవాని, ఇద్దరు కూతుర్లున్నారు. భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

ఒకరికి యావజ్జీవం

టేక్మాల్(మెదక్): హత్య కేసులో ఒకరికి జీవితఖైదుతోపాటు జరిమానాను బుధవారం అదనపు కోర్టు జడ్జి విధించారు. ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2018 జులై 30న టేక్మాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాద్లూర్ గ్రామానికి చెందిన నీళ్ల కొమురయ్య, ఎరుకల రాములు మధ్య గొడవైంది. అదే సమయంలో ఎర్కల సాయికుమార్ ఎందుకు గొడవ పడుతున్నారని అడుగగా మధ్యలోకి నీవెందుకు వస్తున్నావని అతడి మర్మాంగంపై కొమురయ్య బలంగా తన్నాడు. ఈ విషయాన్ని ఇంట్లోకి వెళ్లి సాయికుమార్ తన భార్యకు చెప్పడంతో 108లో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మృతుడు సాయికుమార్ భార్య పద్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అప్పట్లో సాక్ష్యాధారాలు కోర్ట్‌కు నివేదించారు. వీటిని పరిశీలించిన అదనపు కోర్టు సంగారెడ్డి స్పెషల్ ఎస్సీ, ఎస్టీల న్యాయమూర్తి సునీతర వీంద్రరెడ్డి ఈ కేసులో నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ.400 జరిమానా విధించినట్లు తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీచర్, ప్రిన్సిపాల్‌పై కేసు

పటాన్‌చెరు టౌన్: ఓ స్కూల్ టీచర్, ప్రిన్సిపాల్‌పై బుధవారం భానూర్-బీడీఎల్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. హెడ్‌కానిస్టేబుల్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. చేవేళ్లకు చెందిన వెంకటలక్ష్మి కూతురు(6) పాటీ గ్రామ సమీపంలోని సాయి పబ్లిక్ స్కూల్‌లో ఫస్ట్ క్లాస్ చదువుతోంది. ఆదివారం విద్యార్థిని టీచర్ కర్రతో కొట్టింది. కాగా బుధవారం విద్యార్థిని తల్లి వెంకటలక్ష్మి ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ విజయనాయుడు దృష్టికి తీసుకెళ్లగా దుర్భాషలాడిందని ఆరోపించింది. కేసు దర్యాప్తులో ఉంది.

జోరువాన


చేగుంట మండలంలో..


హుస్నాబాద్‌లో..


తడ్కపల్లి శివారులో మొక్కజొన్నలో పైరులో నీరు


ఎన్సాన్‌పల్లిలో..


సంగారెడ్డిలో..

ఉమ్మడి జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. పట్టణాల్లో కురిసిన వాన లెక్క చేయకుండా ప్రజలు రెయిన్‌కోట్లు, గొడుగుల సాయంతో రోడ్లపై సంచరించారు. గ్రామీణ ప్రాంతాల్లో కురిసిన వానకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. సిద్దిపేట తడ్కపల్లిలో మొక్కజొన్న పైరుల్లో నీరు చేరింది. సంగారెడ్డిలో రోజంతా ముసురు కమ్ముకుంది. మెదక్‌లోని చేగుంట మండలం చిన్న చివునూరు శివారులో పొలాల్లోకి నీరు చేరింది.

ఆరోగ్యంపై పట్టుసడలొద్దు


ఓ హోటల్‌లో బిర్యాని తిని అస్వస్థతకు గురై ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకులు(ఫైల్)




ఓ హోటల్‌లో ఆహార పదార్థాల నాణ్యత పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి ధర్మేందర్(ఫైల్)

అసలే వర్షాకాలం.. వ్యాధులు సోకడానికి అవకాశం ఉంటుంది. కంటికి ఇంపుగా కనిపించే పదార్థాల జోలికి వెళ్తుంటారు. దీంతో అనారోగ్యం పాలవుతుంటారు. ఈ క్రమంలోనే బహిరంగంగా విక్రయించే ఆహార పదార్థాలతోపాటు కారం, పసుపు, నూనెలు, నెయ్యి, పప్పు దినుసులు, మసాలాలు, ఆహారపదార్థాలు ఇలా ఒకటేమిటి అన్నీ కల్తీ అవుతున్నాయి. అయితే రోగాలు దరిచేరకుండా ఇంట్లో తయారు చేసిన ఆహార పదార్థాలనే భుజించాలని వైద్యులు సూచిస్తున్నారు. దీనిపై కథనం..

- ఎక్కడపడితే అక్కడ తింటే ముప్పే
- వర్షాకాలంలో ఇంటి వంటే శ్రేయస్సు అంటున్న వైద్యులు

ఈ ఘటనలు నిదర్శనం..

- 2 ఏళ్ల క్రితం ఫుడ్‌సేఫ్టీ అధికారులు, పోలీసులు సదాశివపేట పట్టణంలోని కల్తీ నూనెలు, అల్లం పేస్ట్‌లను గుర్తించి, కేసులు నమోదు చేశారు.
- జహీరాబాద్, సదాశివపేట పట్టణాల్లోని హోటళ్లల్లో తిని 40 మంది వరకు అస్వస్థతకు గురికావడం తెలిసిందే.

దాశివపేట(సంగారెడ్డి): వర్షాకాలంలో వ్యాధులు విజృంభించే అవకాశం లేకపోలేదు. ఈ కీలక సమయంలో సంగారెడ్డి జిల్లాలోని 8 మున్సిపాలిటీలు, 641 గ్రామ పంచాయతీల పరిధిలోని హోటళ్ల, శుభ్రతపై మున్సిపల్ అధికారులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు దృష్టి సారించడం లేదని ప్రజలు అంటున్నారు. నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడూ తనిఖీలు చేపట్టి ఆహార పదార్థాల నాణ్యత పరిశీలించాల్సి ఉంటుంది. అలాగే ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, వైన్స్‌ల పర్మిట్ గదుల్లో బజ్జీలు, పకోడి, సమోసాలు, చికెన్ ఇతర పదార్థాల్లో ఎంత నాణ్యత ఉందో తెలియాల్సి ఉంది.

- తక్కువ ధరకు వస్తుందని కల్తీ టీ పొడిని వాడుతుంటారు. కల్తీ టీ పొడి 200లకే లభిస్తోంది. టీ పొడిలో ఎక్కువగా చింతగింజల పొడి, రసాయనాలతో కూడిన చాక్లెట్ పొడి, రుచికి రసాయనాల పొడులు, సింథటిక్ కలర్స్ కలుపుతున్నారని సమాచారం.
- పాలల్లో చిక్కదనం కోసం యూరియా వంటిని కలిపితే తెల్లనిచార ఏర్పడుతుంది.
- శనగపిండిని, బియ్యం, బఠానీ, కేసరి పప్పు, మొక్కజొన్న పిండి వంటి వాటితో కల్తీ చేస్తారు. కల్తీ శనగపిండి వాడితే శరీరం దిగువ భాగంలో పక్షవాతం, భుజాలు, వెన్నెముక, జీర్ణాశయం, రుగ్మతలు ఎదుర్కొవాల్సి ఉంటుంది.
- విటన్నీకంటే కృత్రిమ రంగులు అత్యంత ప్రమాదకరమైనవి. ధనియాల పొడిలో అడవిగడ్డి పొడిని కలుతారని దానిని ఎండబెడితే ధనియాల రంగు వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతున్నారు.

ఆహార తనిఖీ అధికారుల కొరత

సంగారెడ్డి జిల్లాలో ఆహార నియంత్రణ అధికారి ధర్మేంద్ర ఒక్కరే ఉన్నారు. ఆయనకు సంగారెడ్డి జిల్లాతో పాటు అదనంగా మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి జిల్లా బాధ్యతలు అప్పగించారు. కానీ ఈ జిల్లాలో ఇద్దరు చొప్పున ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉండాలి. ఒక్కరూ లేకపోవడం విడ్డూరం. 2021 నుంచి 2023 జూన్ వరకు వివిధ చోట్ల తనిఖీలు చేసి 37 కేసులు మాత్రమే నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ 2.20 లక్షలు జరిమానా విధించారు. పోలీసు ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారుల సమన్వయ లోపంతో వ్యాపారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యంపై ఉన్న శ్రద్ధ ఇదేనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

టేస్టింగ్ సాల్ట్‌తో..: బయట ఆహారంలో తప్పనిసరిగా టేస్టింగ్ సాల్ట్ వినియోగిస్తారు. ఐదేళ్ల కంటే తక్కువ ఉన్న వాళ్ల పదేపదే తింటే పక్షవాతానికి దారితీయనుంది. మహిళల్లో గర్భస్రావం, గర్భం దాల్చకపోవడం, పురుషుల్లో మెదడు, జీర్ణ వ్యవస్థ సంబంధిత రుగ్మతలకు దారితీయనుంది.

నూనెకు పసుపు రంగు : వంట నూనెలో మెటానిల్ ఎల్లో అనే రసాయనం వాడతారు. ఇది మెదడుపై తీవ్రప్రభావం చూనుంది. ఫాస్పరస్‌తో నిండిన ఈ ఫెస్టిసైడ్ నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుంది. పక్షవాతం బారినపడే అవకాశం ఉంది.అలాగే వనస్పతి, కృత్రిమ రంగులు కల్తీ చేస్తారు. దీంతో ఆర్థిక నష్టంతోపాటు క్యాన్సర్ సంబంధిత వ్యాధులు రాగలవు. కల్తీ పసుపుతో ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడనుంది.

ఇంటి భోజనం మేలు

వర్షాకాలంలో బయట ఫుడ్ తినకపోవడమే ఉత్తమం. ప్రస్తుత సీజన్లో ఇంట్లోనే చక్కగా వండుకుని వేడిగా ఉన్నప్పుడు తినాలి. రోడ్ల వెంట తయారు చేస్తున్న ఆహార పదార్థాల జోలికి పోవద్దు.

– డాక్టర్ జేమియా, ఇఎస్‌ఐ ఆస్పత్రి సదాశివపేట

తనిఖీలు నిర్వహిస్తున్నాం

జిల్లాలో తరచు హోటళ్ల, కిరాణా దుకాణాలు, ఆహార తయారీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. అనుమతి, లైసెన్స్ లేనివారిపై చర్యలు తీసుకుంటున్నాం, పరిశుభ్రత పాటించేలా నిర్వాహకులకు అదేశించాం. నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగ చర్యలు తీసుకుంటాం. తగిన సిబ్బంది లేకపోవడంతోనే ఎక్కువ తనిఖీలు చేపట్టలేకపోతున్నాం.

– ధర్మేందర్ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి

పొలం పనులు చేస్తుండగా గుండెపోటు

- అక్కడికక్కడే రైతు మృతి


నర్సింహులు (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): పొలం పనులు చేస్తూ గుండెపోటుతో రైతు మరణించాడు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లిలో చోటుచేసుకుంది. బుధవారం మండలంలోని కొర్విపల్లికి చెందిన ముత్తిగల్ల నర్సింహులు(54) తన పొలంలో ఒరాలు చేస్తూ గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కొంతదూరంలో పొలం పనిచేస్తున్న భార్య భాగ్యమ్మ గమనించి దగ్గరికి వచ్చేలోగా నర్సింహులు మృతిచెందాడు. అతడి మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మహిళకు తీవ్రగాయాలు

- బూచినెల్లి శివారులో ఘటన

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బూచినెల్లి శివారులో బుధవారం జరిగింది. చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేశ్ కథనం ప్రకారం.. 52 ఏళ్ల మహిళ జాతీయ రహదారి గుండా నడుచుకుంటూ వెళుతోంది. హైదారాబాద్ ను ంచి ముంబయి వైపు వెళ్తున్న లారీ బూచినెల్లి శివారులో ఆమెను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ ఆమెను అంబులెన్స్‌లో జహీరాబాద్ ప్రభుతాస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. బూచినెల్లి వీఆర్‌ఏ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో వ్యక్తికి నెల జైలు

కోహెడ(హుస్నాబాద్): దాడి కేసులో గాయపరిచిన వ్యక్తికి నెలరోజులు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ బుధవారం జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి తీర్పునిచ్చారు. ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. 2016లో కోహెడకు చెందిన వెల్పుల ఉపేందర్‌పై పొన్నాల పరమేశ్ బండరాయితో గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదుతో పరమేశ్‌పై కేసు నమోదు చేసి హుస్నాబాద్ కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణకు రాగా హుస్నాబాద్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి కృష్ణతేజ పైవిధంగా తీర్పునిచ్చారు. కోర్టు కానిస్టేబుల్ సంజీవ్‌ను అభినందించారు. కాగా బాధితుడు ఉపేందర్ అనారోగ్యంతో 2019లో చనిపోయాడు.

గురుకులంలో ర్యాగింగ్!

- ఒత్తిడితో జూనియర్ అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు
- సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఘటన

చేర్యాల (సిద్దిపేట): సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ర్యాగింగ్ చేయడంతో ఒత్తిడి తట్టుకోలేక ఓ విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడు. ఈ ఘటన బుధవారం వెలుగు చూసింది. హన్మకొండ జిల్లా కాజీపేటకు చెందిన గడికోట జస్వంత్ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. 5 రోజులుగా కొందరు సీనియర్ విద్యార్థులు జస్వంత్‌ను ర్యాగింగ్ చేస్తున్నారు. అన్నం తినే సమయంలో ప్లేట్ లాక్కోవడం, స్నానానికి వెళ్లే క్రమంలో బకెట్, మగ్గు లాక్కోవడం వంటి పనులు చేస్తూ ఇబ్బంది పెడుతున్నారు. దీంతో జస్వంత్ తీవ్ర ఒత్తిడికి గురై అస్వస్థకు గురయ్యాడు. సీనియర్ల చేష్టలతో ఎలాంటి ఆహారం తీసుకోకపోవడంతో అనారోగ్యానికి గురైన జస్వంత్ మంగళవారం రాత్రి కళాశాలలో కింద పడిపోయాడు. గమనించిన అధ్యాపకులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం ఈ విషయం తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. జశ్వంత్ పట్ల సీనియర్లు వ్యవహరించిన తీరు తన దృష్టికి రాలేదని ప్రిన్సిపాల్ అశోక్‌బాబు తెలిపారు. తనకు కళాశాలలో చదవడం, ఉండడం ఇష్టం లేక ఇలా చేసినట్లు ఉందన్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు


పొలంలోకి దూసుకెళ్లిన కారు

కొడిపల్లి(నర్సాపూర్): కారు అదుపుతప్పి బుధవారం పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. మెదక్‌కు చెందిన వ్యక్తి, కారులో హైదరాబాద్ నుంచి మెదక్ వైపునకు వెళ్తున్నాడు. కొడిపల్లి పెద్దచెరువు కట్ట దిగువ 765 జాతీయ రహదారి సమీపంలోకి రాగానే వర్షం కారణంగా వాహనం అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో పక్కన పొలంలోని బురద నీటిలోకి కారు దూసుకుపోయింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదమూ జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

గాయపడ్డ వృద్ధుడి మృతి


పెంటయ్య (ఫైల్)

పాపన్నపేట(మెదక్): గాయపడ్డ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మల్లంపేటలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకల పెంటయ్య (75) వ్యవసాయం చేస్తుండేవాడు. కాగా ఈనెల 17న పొలం పనులకని వెళ్లి జారిగట్టుపై నుంచి కిందపడ్డాడు. ఈ ఘటనలో గాయాలైన పెంటయ్యను మెదక్‌లో ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యానికి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ సంగయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


గ్రామ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : మహిళ స్వయం సహాయ సంఘాలకు వివిధ అంశాల్లో శిక్షణ అందించడంతోపాటు వారు తయారు చేసిన ఉత్పత్తులకు ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి భరోసానిచ్చారు. మహిళలు స్వయం ఉపాధితోపాటు ఆర్థికంగా రాణించేలా ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. బుధవారం భారతినగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో నాబార్డ్ సహకారంతో ఈశ్వరాంబ మహిళా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా సంఘాల ఉత్పత్తుల గ్రామ దుకాణం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు అందించడంతోపాటు మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్‌యేనని వివరించారు. మహిళ ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, నాబార్డ్ జిల్లా మేనేజర్ కృష్ణతేజ, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వే ఆధారంగా జనగామ టికెటివ్వాలి

- ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు


మాట్లాడుతున్న మండల శ్రీరాములు

చేర్యాల(సిద్దిపేట): సర్వేలు నిర్వహించి సర్వేలో ఎవరికి అనుకూలంగా ఉంటే వారికే జనగామ టికెట్ ఇవ్వాలని మాజీ ఆప్కో చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మండల శ్రీరాములు అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని మరిచి ప్రజల్లో వ్యతిరేకత పెంచుకున్న జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని త్వరలోనే ప్రజలు తరిమి కొడతారన్నారు. బీసీ నాయకుడిని, స్థానికుడినైన తనకే బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వాలన్నారు. మూడోసారి కేసీఆర్ సీఎం కావాలని పట్టణ కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో బుధవారం పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ జనగామ టికెట్ స్థానికేతరుడైన ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి కాకుండా స్థానికుడిని, బీసీనేతనైనా తనకు కేటాయించాలని ఈ సందర్భంగా అధిష్టానాన్ని కోరారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి చేర్యాల ప్రాంతంపై అవగాహన లేదని, అవగాహన రాహిత్యంతోనే చేర్యాల, జనగామ ప్రాంతాల్లో భూములు కబ్జా చేస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు బోయిని రాజు, సిరుమల్ల నర్సింహులు, పర్షరాములు, జీవరత్నం, మల్లేశం, మార్కండయ్య, 4 మండలాల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

పటాన్‌చెరు టౌన్: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్‌ఐ గౌస్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని గౌతమ్‌నగర్‌కి చెందిన శంషుద్దీన్ (24) వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. గురువారం పటాన్‌చెరు మండలం కర్దనూర్ గ్రామంలో భవనం నిర్మిస్తున్న సత్యం రాజు ఎలక్ట్రికల్ పనికోసం శంషుద్దీన్‌ను పిలిచాడు. పని ప్రదేశంలో గోడపై నడుచుకుంటూ వెళుతున్న క్రమంలోపైన విద్యుత్ వైరు తగలడంతో విద్యుదాఘాతనికి గురై అక్కడికక్కడ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సిరాజుద్దీన్ తన కుమారుడి మృతికి సత్యం రాజు నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మురికి కాలువలోపడి వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పటాన్‌చెరు టౌన్: మద్యం మత్తులో మురికి కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ గౌడ్ కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం కర్దనూర్ గ్రామ సమీపంలోని బీరప్ప దేవస్థానం సమీపంలోని మురికి కాలువలో సుమారు 35–40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మత్తులో కాలువలో పడి మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే తమను ఆశ్రయించాని బీడీఎల్ పోలీసులు కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బాలుడి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: బాలుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలుడు 8వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. కుమారుడు తల్లి పోలీసులను ఆశ్రయించడంతో ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత
- ఒక్కరోజే రూ.3,34,199 కాజేసిన కేటుగాళ్లు
- అనుమానం వస్తే ఫిర్యాదు చేయండి

సిద్దిపేటకమాన్: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్‌కు స్పందించకూడదని, ఎవరికి బ్యాంక్, ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలు తెలపకూడదని చెప్పారు. కమిషనరేట్ పరిధిలో గురువారం పలు రకాల సైబర్ మోసాల్లో పలువురు బాధితుల ఖాతా నుంచి రూ.3,34,199 కాజేసినట్లు తెలిపారు. సీపీ తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి టెలిగ్రాంలో ట్రేడింగ్ మెసేజ్ చూసి అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేయగా.. తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని తెలిపాడు. గుర్తు తెలియని వ్యక్తి తెలిపిన మాటలు నమ్మిన బాధితుడు.. సైబర్ నేరగాడు పంపిన లింక్ ఓపెన్ చేసి ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా ఆరు విడతలుగా మొత్తం రూ.2,15,668 పంపించాడు. రెండు రోజుల తర్వాత లింకు ఓపెన్ చేయగా బ్లాక్ అయింది. దీంతో మోసపోయానని గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు బాధితుడు ఫిర్యాదు చేశాడు.



పార్ట్ టైం జాబ్ పేరుతో..

సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఫేస్‌బుక్‌లో పార్ట్‌టైం జాబ్ అనే ప్రకటన చూసి అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి సూచించిన విధంగా బాధితుడు పలు విడతలుగా గూగుల్ పే ద్వారా రూ.67,350 పంపించాడు. తర్వాత కూడా మరిన్ని డబ్బులు అడగగా అనుమానంతో జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం పేరిట

సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ మహిళ ఇన్‌స్టాగామ్‌లో నటరాజ్ పెన్సిల్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం ఉందని, ఇంటి నుంచి పనిచేసుకోవచ్చనే ప్రకటన చూసి అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేసింది. ముందుగా ఐడీ కార్డు, ప్రాసెసింగ్ చార్జీలు ముందుగా చెల్లించాలని గుర్తు తెలియని వ్యక్తి తెలపగా.. ఆ మాటలు నమ్మిన బాధితురాలు ఆన్‌లైన్‌లో రూ.25,182 పంపించింది. తర్వాత ఫోన్ చేయగా ఎలాంటి స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చిన బాధితురాలు జాతీయ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశాడు.

కస్టమర్ కేర్ పేరుతో

గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి డబ్బులు ట్రాన్స్‌ఫర్ గురించి ఆన్‌లైన్‌లో వెతికి అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి మాట్లాడి డబ్బులు రీఫండ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోమని సూచించగా.. ఆ మాటలు నమ్మిన బాధితుడు యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. అందులో క్రెడిట్ కార్డు వివరాలు, ఓటీపీ వివరాలు నమోదు చేయగానే.. తన ఖాతా నుంచి రూ.25,999 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో అనుమానం వచ్చి బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. కాబట్టి సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీ చెప్పారు.

ఆస్పత్రికి తరలించి.. వైద్యం చేయించి..

మానవత్వం చాటిన మహిళ అధికారి

నర్సాపూర్: అస్వస్థత బాధపడుతూ.. వర్షంలో తడుస్తూ రోడ్డు పక్కన పడి ఉన్న వ్యక్తిని ఆస్పత్రిలో వైద్యం చేయించి ఓ మహిళ మానవత్వం చాటింది. నర్సాపూర్ ఐసీడీఎస్ సీడీపీఓ హేమభార్గవి విధుల్లో భాగంగా ఏఆర్‌ఈఎస్ సెక్రటరీ సునీతతో కలసి గురువారం మెదక్ వెళ్లి తిరిగి నర్సాపూర్ వస్తున్నారు. రెడ్డిపల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కన రోడ్డుపై ఓ వ్యక్తి కింద పడిపోయి కనిపించాడు. వారు తమ వాహనాన్ని నిలిపి వెళ్లి చూసేసరికి అతను వర్షంలో తడిసి మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. దీంతో వెంటనే అతడిని తమ వాహనంలో సమీపంలోని రెడ్డిపల్లి పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించారు. ప్రాథమిక వైద్యం అనంతరం వివరాలు అడగ్గా.. అతని పేరు ఒర్రె సాయిలు అని, తనది కామారెడ్డి జిల్లా పిట్లం మండలం బుర్నాపూర్ గ్రామమని చెప్పాడు. నాలుగు రోజుల క్రితం తన గ్రామం నుంచి బయలు దేరానని, హైదరాబాద్‌లోని లింగంపల్లికి వెళుతున్నట్లు వివరించాడు. అయితే.. నాలుగు రోజులుగా భోజనం లేకపోవడం, కాలినడక కొనసాగించడంతో కిందపడి పోయి ఉంటాడని సీడీపీఓ హేమభార్గవి చెప్పారు. అతని కాలికి గాయం సైతం ఉందన్నారు. ప్రస్తుతం అతను రెడ్డిపల్లి పీహెచ్‌సీలో వైద్యం పొందుతున్నాడు. వైద్యం అనంతరం అంగన్‌వాడీ టీచర్ హేమలత అతనికి భోజనం పెట్టడంతో పాటు పాత బట్టలు అందచేసినట్లు తెలిసింది. ఒకవైపు జోరుగా వర్షాలు కురుస్తున్నా..హేమభార్గవి, స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి సునీతతో పాటు అంగన్‌వాడీ టీచర్ సేవలను పలువురు ఈ సందర్భంగా అభినందించారు.



అస్వస్థతకు గురై రోడ్డు పక్కన పడి ఉన్న వ్యక్తిని రెడ్డిపల్లి పీహెచ్‌సీకి తీసుకెళుతున్న దృశ్యం

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మల్కాపూర్ 65వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైనట్లు కొండాపూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని, మృతురాలి వయసు 50 లోపు ఉంటుందన్నారు. వివరాలు తెలిసినవారు కొండాపూర్ సీఐ 8712656722, ఎస్‌ఐ 8712656748 నంబర్‌లో సంప్రదించాలన్నారు.



గుర్తు తెలియని మృతదేహం

అయ్యో పాపం ఉమాజీ

గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి మృత్యువాత

కల్హేర్(నారాయణఖేడ్): కూలీ పనులు చేసేందుకు వచ్చి గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఇటుక బట్టీ కూలీ మరణించాడు. గురువారం నిజాంపేట్ మండలం మునిగేపల్లి శివారులో సంగారెడ్డి–నాందేడ్ 161 జాతీయ రహదారిపై సంఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బౌరాద్ రాంనగర్ కాలనీకి చెందిన ఉమాజీ (47) ఇటుక బట్టీలో కూలీ పనులు చేసేందుకు వచ్చాడు. పనులు పూర్తి చేసుకుని తోటి కూలీలతో కలిసి రాత్రి అక్కడే నిద్రిస్తున్నారు. నిద్ర నుంచి లేచిన ఉమాజీ జాతీయ రహదారిపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో మృతి చెందాడు. ఎవరూ గుర్తుపట్టలేనంతగా శరీరం ఛిద్రమైంది. మృతుడి భార్య లక్ష్మీబాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

కేజ్ వీల్ కిందపడి వ్యక్తి మృతి

టేక్మాల్(మెదక్): ట్రాక్టర్ దున్నుతుండగా ప్రమాదవశాత్తు కేజ్ వీల్ కింద పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన టేక్మాల్‌లో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. టేక్మాల్‌కు చెందిన చాకలి శ్రీనివాస్(28) ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం గ్రామ శివారులో ఓ పొలంలో కేజ్‌వీల్ ట్రాక్టర్‌తో దున్నుతుండగా ప్రమాదవశాత్తు జారి వీల్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఏఎస్‌ఐ తుక్కయ్య ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్‌కు గతేడాది వివాహం కాగా, అతడి భార్య పూజ ప్రస్తుతం గర్భిణిగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.



శ్రీనివాస్ (ఫైల్)

మూర్ఛతో కార్మికుడి మృతి

మనోహరాబాద్(తూప్రాన్): మూర్ఛతో కార్మికుడు మృతిచెందిన ఘటన మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం జనగాం జిల్లా వెల్దండ మండలానికి చెందిన సిద్దరాములు (41) కొన్ని నెలలుగా ముప్పిరెడ్డిపల్లిలో అద్దెకుంటూ స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. మూడు రోజులుగా అనారోగ్యానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. గురువారం ఉదయం తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన ఇరుగుపొరుగు తలుపులు తీసి చూడగా మృతిచెంది కనబడ్డాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నట్లు తెలిపారు. ఎస్‌ఐ సందీప్‌రెడ్డిని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.



సిద్దరాములు మృతదేహం

దైవదర్శనానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

చేర్యాల(సిద్దిపేట): సూర్యాపేట జిల్లా ఎర్రవరం లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వెళుతున్నా అని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని కడవేర్గు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొయ్యడ వెంకటేశంగౌడ్ (35) ఈ నెల 15న మొదటగా చేర్యాలకు వెళ్తున్నా అని చెప్పి ఇంటి నుంచి బయటకి వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేసింది. జనగామ దగ్గరలో ఉన్నాను సూర్యాపేట జిల్లాలోని ఎర్రవరం లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వెళ్తున్నానని చెప్పిన వెంకటేశం తిరిగి ఇంటికి రాలేదు. తర్వాత ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు గురువారం చేర్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.



వెంకటేశం

చికిత్స పొందుతూ యువతి మృతి

కడుపు నొప్పి తాళలేక నిద్రమాత్రలు సేవించిన వైనం

సిద్దిపేటరూరల్: చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఏర్వ నర్సవ్వ కూతురు ఏర్వ శివాణి (21)కి నెలరోజుల క్రితం అపెండిసైటిస్ ఆపరేషన్ జరిగింది. ఆపరేషన్ అయిన వారం రోజుల నుంచి కడుపులో నొప్పిగా ఉందని చెప్పగా కుటుంబీకులు ఆస్పత్రిలో చూపించారు. అయినా కడుపునొప్పి తగ్గలేదు. దీంతో ఈ నెల 12వ తేదీన రాత్రి సమయంలో ఆకస్మాత్తుగా వారి వద్ద కింద పడిపోయింది. ఏం జరిగిందని కుటుంబీకులు అడగడంతో కడుపునొప్పి భరించలేక బీపీ గోలీలు, నిద్రమాత్రలు వేసుకున్నానని చెప్పింది. దీంతో వెంటనే శివాణిని సిద్దిపేటలో పనిచేసే ప్రైమ్ కేర్ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. అప్పటికే పరిస్థితి విషమంగా ఉండడంతో అదేరోజు సిద్దిపేటలోని సురక్ష ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న శివాణి పరిస్థితి 19వ తేదీన మరింత విషమంగా మారడంతో వైద్యం నిమిత్తం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో గురువారం ఉదయం 01:50గంటలకు చేర్పించారు. దీంతో శివాణిని పరీక్షించిన వైద్యులు మార్గ మధ్యలోనే శివాణి మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి అనుమానం లేదని, అమ్మమ్మ నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతురాలు శివాణి(ఫైల్)

తప్పతాగి పడిపోయి..



వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం నెంటూరు సమీప కెనాల్ వద్ద మద్యం మత్తులో పడిఉన్న గుర్తు తెలియని యువకుడిని గజ్వేల్ ఆసుపత్రికి తరలించినట్లు బేగంపేట ఎస్సై అరుణ్ తెలిపారు. బుధవారం రాత్రి తాగిన మత్తులో లేవలేని స్థితిలో ఉన్న అతని వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినా నోరు విప్పలేదన్నారు. యువకుడిని వివరాలు తెలిస్తే బేగంపేట పోలీస్‌స్టేషన్ 8712667337 నెంబర్‌కు తెలియజేయాలని ఎస్సై సూచించారు.

కులం పేరుతో దాడి..కేసు నమోదు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కులం పేరుతో దూషిస్తూ దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూర్‌పల్లి మండలం రాయవరం గ్రామానికి చెందిన రాజు అనే యువకుడు జగదేవ్‌పూర్ మండలం అనంతసాగర్‌కు చెందిన రవీందర్ అనే వ్యక్తి వద్ద ఇటీవల రెండు లేగదూడలను కొనుగోలు చేశాడు. దీనికోసం రూ.19 వేలు ఇవ్వాల్సి ఉండగా రూ.14 వేలు చెల్లించాడు. మిగతావి తర్వాత ఇస్తానని రాజు చెప్పాడు. కాగా, డబ్బుల కోసం రవీందర్ ఫోన్ చేయగా అనంతసాగర్‌కు వస్తున్నాను అక్కడ డబ్బులు ఇస్తానని రాజు చెప్పాడు. రాజు తన సోదరుడితో కలిసి అనంతసాగర్ బస్టాండ్‌కు వచ్చాడు. అక్కడ డబ్బుల విషయంలో రాజు, రవీందర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో రాజును కులం పేరుతో దూషిస్తూ రవీందర్ అసభ్యంగా మాట్లాడాడు. తన వెంట వచ్చిన ముగ్గురితో కలిసి రాజును కర్రలతో చితకబాదాడు. దీంతో బాధితుడు జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. రాజుపై జరిగిన దాడిని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ ఖండించారు. వెంటనే నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

వ్యక్తి అదృశ్యం



యూసఫ్ (ఫైల్)

సంగారెడ్డి టౌన్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కులబ్‌గూరు గ్రామానికి చెందిన సయ్యద్ యూసఫ్ (30) ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మొబైల్ ఫోన్ పనిచేయడంలేదని రిపేర్ కోసం ఈనెల 14వ తేదీన సంగారెడ్డికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అతడి కోసం తెలిసినవారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సూపర్‌వైజర్‌కు జరిమానా

సిద్దిపేటకమాన్: సిద్దిపేట కోమటిచెరువులో డైనోసార్ పార్క్ సూపర్‌వైజర్ పనిలో పెట్టుకున్న వర్కర్స్ చెత్తను వేయడంతో సూపర్‌వైజర్ రజనిబాబుకు గురువారం రూ.10వేల జరిమానా విధించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

తహసీల్దార్, ఆర్‌ఐలపై చర్యలు తీసుకోవాలి


మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాల పంపిణీలో అవకతవకలకు పాల్పడిన తహసీల్దార్, ఆర్‌ఐలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, నిధి అగర్వాల్‌లకు జెడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డి, ఎంపీటీసీ చెట్కూరి కల్యాణికమలాకర్, గ్రామస్తులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు గ్రామసభలో తీర్మానం చేసిన పేర్లు కాకుండా అనర్హులను జాబితాలో చేర్చి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని వినతిలో పేర్కొన్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారని అదనపు కలెక్టర్‌లకు వివరించారు. పంపిణీ చేసిన పట్టాలను రద్దు చేసి గ్రామసభలో మళ్లీ లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. అదేవిధంగా ప్రోటోకాల్ పాటించని రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేస్తామని కలెక్టర్లు హామీ ఇచ్చారిన వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌లకు ఫిర్యాదు చేస్తున్న జెడ్పీటీసీ, తదితరులు

చెట్టును ఢీకొట్టిన కారు.. వ్యక్తి మృతి

గజ్వేల్‌రూరల్: గుంతలమయమైన రోడ్డుపై ఓ కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గజ్వేల్ మండలం కోమటిబండ సమీపంలో చోటు చేసుకుంది. గజ్వేల్ ఏఎస్‌ఐ పండరి తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ ప్రాంతానికి చెందిన సర్దార్ సన్నిసింగ్(33)తోపాటు అతని స్నేహితులు సాయిమాధవ్, బి. విశాల్, సాయికుమార్‌లతో కలిసి బుధవారం శామీర్‌పేటలోని కట్టమైసమ్మ వద్ద జరిగిన కార్యక్రమానికి హోండా సిటీ (టీఎస్ 07ఈడీ 0908) కారులో వచ్చారు. తిరిగి కరీంనగర్‌కు వెళ్తున్న క్రమంలో తూప్రాన్‌లో ఉన్న విశాల్ భార్యను తీసుకువచ్చేందుకు బుధవారం రాత్రి బయలుదేరారు. ఈ క్రమంలో గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి శివారులో కోమటిబండ సమీపంలో గుంతలమయమైన రోడ్డుపై కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న సర్దార్ సన్నిసింగ్(33) తీవ్ర గాయాలై మృతి చెందగా, కారులో ఉన్న మరో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సర్దార్ సన్నిసింగ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సర్దార్ సన్నిసింగ్ (ఫైల్)



అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

వర్షానికి కూలిన ఇండ్లు



మెదక్ మున్సిపాలిటీ: భారీ వర్షంతో కూలిన ఇల్లు

అల్లాదుర్గం(మెదక్): రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అల్లాదుర్గంలో కుమ్మరి అంజమ్మకు చెందిన ఇల్లు కూలిపోయింది. ఆ సయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మండలంలో మూడు ఇళ్లు కూలిపోయినట్లు తహసీల్దార్ తులసిరాం తెలిపారు.

రేగోడ్(మెదక్): వర్షాలకు రేగోడ్ మండలంలో సంగమేశ్వర తండా పంచాయతీ పరిధిలో బురాన్‌వాడి తండాలో శంకర్ నాయక్ ఇల్లు కూలిపోయింది.

మెదక్ మున్సిపాలిటీ: వర్షం కారణంగా మెదక్ పట్టణంలో పట్టణంలోని బారా ఇమామ్ వీధిలో జంగంగారి రఘుకు చెందిన ఇళ్లు కూలింది.

తూప్రాన్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆరు ఇండ్లు కూలినట్లుగా తహసీల్దార్ జ్ఞానజ్యోతి తెలిపారు. యావపూర్ బండారు నాగరాజు, యాసికి వీరమణి ఇళ్లతో పాటు పడాల్‌పల్లిలో రెండు, రావెల్లి, ఇమాంపూర్‌లో ఒకటి చొప్పున కూలిపోయినట్లు తెలిపారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): వర్షానికి చిలప్‌చెడ్ మండలంలోని బండపోతుగల్ గ్రామంలో టహెద్ అలీ రేకుల ఇల్లు, జగ్గంపేటలో బత్తిలి గంగమ్మ, అజ్జమర్రి, ఫైజాబాద్‌లో ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి.

చేగుంట(తూప్రాన్): చేగుంట మండలంలోని చందాయిపేటలో గాజుల అహ్మద్‌కు చెందిన ఇల్లు, బీకొండాపూర్‌లో బాలనర్సింలు ఇల్లు పాక్షికంగా కూలాయి.

మూడు పాడిగేదెలు మృత్యువాత

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని సికింద్లాపూర్ శివారు వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ సరఫరా చేసే లైన్ తీగలు తెగి పడడంతో చేగూరి సత్యనారాయణగౌడ్‌కు చెందిన మూడు పాడిగేదెలు మృత్యువాత పడ్డాయి. గేదెల విలువరూ.1.80లక్షలు ఉంటుందని తెలిపారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ ఏనుగు సుధాకర్‌రెడ్డి కోరారు.



రేగోడ్: కూలిన ఇంటి గోడను చూపిస్తున్న బాధితులు



శివ్వంపేట(నర్సాపూర్): పాడిగేదె కళేబరం



తూప్రాన్: యావపూర్‌లో వర్షానికి కూలిన ఇల్లు



చిలప్‌చెడ్(నర్సాపూర్): బండపోతుగలో కూలిన రేకుల ఇల్లు



చేగుంట(తూప్రాన్): చందాయిపేటలో కూలిన అహ్మద్‌కు చెందిన పెంకుటిల్లు